

# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 10, మే 2026




అక్రమంగా పశువుల రవాణా..

# 74 పశువుల పట్టివేత

చింతలమానేపల్లి, మే 9, ప్రభాతవార్త

మహారాష్ట్ర నుంచి తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న పశువులను శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ జీవన్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా పశువులను తరలిస్తుండగా గూడెం అంతరాష్ట్ర వంతెన చెక్‌పోస్టు వద్ద ఒక వాహనం దొరకగా, తప్పించుకుని వెళ్తున్న మరో వాహనాన్ని కర్జవెల్లి గ్రామస్థుల సహాయంతో పట్టుకుకొనగా. రెండు వాహనాల్లో ఉన్న 37 ఆవులు,35 ఎడ్లు, 2 దూడలను స్వాధీనం చేసుకొని 11 మందిపై కేసు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.



# రైతులు ధైర్యంగా ఉండండి ప్రతి గింజ కొంటాం

* మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్



లక్షెట్టిపేట, మే 09, ప్రభాతవార్త

రైతులు ఎలాంటి అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. శనివారం రోజు పట్టణంలోని విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు ధైర్యంగా ఉండాలని, ప్రతి గింజ కొంతమంది అన్నారు. త్వరలోనే చనిపోయిన రైతు కుటుంబాల నుండి ఇద్దరికీ 10 లక్షలు చొప్పున, మరో ఇద్దరికి 6 లక్షలు చొప్పున పరిహారం అందేలా కృషి చేస్తామని అన్నారు. ప్రభుత్వ సహాయం కూడా అందిస్తామని అన్నారు. అనంతరం కొత్తూరు, గంపలపల్లిలోని మృతుల కుటుంబాలను పరామర్శించి తను ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల తక్షణ సహాయం అందించారు. అదేవిధంగా గూడెం అభివృద్ధికి 70 కోట్లు మంజూరయ్యాయని, పుష్కరాలలోపు పనులు పూర్తి చేస్తామని అన్నారు. అదేవిధంగా దేశంలోనే మొట్టమొదటి ఫిష్ పాండ్ గుడిపేటలో త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. దీంతో 200 మందికి ఉపాధి దొరుకుతుందని అన్నారు. పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని బుధవారం వరకు పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేయాలని గురువారం నుండి ప్రభుత్వం నుంచి పనులు మొదలవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి, పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ, కౌన్సిలర్లు మండల, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




పోడు భూముల రక్షణ కోసం

# రైతుల పోరాటం

చింతలమానేపల్లి, మే 9, ప్రభాతవార్త:

అటవీ అధికారుల పోడు భూముల సర్వే ప్రక్రియలో భాగంగా చేపట్టే కందకాలు ఆపాలని కర్జెల్లి గ్రామ రైతులు, మద్దతుగా సర్పంచ్ చౌదరి నారాయణ డిమాండ్ చేస్తు ధర్నాకు దిగారు. పోడు భూముల సర్వేలో భాగంగా కర్జెల్లి రేంజ్ పరిధిలోని కర్జెల్లి గ్రామ శివారు ప్రాంతం నుంచి ఎక్స్‌కవేటర్ సహాయంతో శనివారం అటవీ అధికారులు కందకాలు చేపడుతుండగా రైతులు అడ్డుకున్నారు. ఎఫ్ ఆర్ ఓ సుభాష్ రైతులతో ముందుగానే అటవీ భూములకు సంబంధించిన సమాచారం గ్రామ సభను నిర్వహించి వివరాలు తెలిపారు. నిబంధనల మేరకు భూముల సర్వేను చేసుకోవాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలుపుతూ హామీ ఇచ్చారు. కర్జెల్లి రేంజ్ కార్యాలయానికి రైతులు వెళ్లి అధికారులతో తమ గోడును చెప్పుకున్నారు. కాగా అధికారులు చేపట్టిన రేఖల ప్రకారం కొంత భాగాన్ని తీసుకుని ట్రంచ్ ఏర్పాటు చేసి, మిగిలిన భాగాన్ని రైతులకు పంచి చేస్తామని తెలిపారు. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వేరేవాళ్లు సాగు చేసే భూములకీ తాము ఎలా వెళ్తామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ స్థాయిలో సంబంధిత అధికారులు చర్చలు చేపట్టి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సర్పంచ్ నారాయణ విజ్ఞప్తి చేశారు. సంఘటన జరిగిన స్థలానికి ఎస్సై జీవన్ చేరుకొని గొడవలు కాకుండా బందోబస్తు నిర్వహించారు. పోడు రైతులు వినకపోవడంతో ఫారెస్ట్ అధికారులు పోడు భూములకు సంబంధించిన విషయాన్ని పై అధికారి ఎఫ్‌డీఓ తో లేదా ఎఫ్ఆర్ఓ తో మాట్లాడి చర్చించండి అని అర్థమయ్యేలా వివరంగా తెలిపారు. పోడు భూముల రైతులు గ్రామ సర్పంచ్ కలిసి ఎస్సై జీవన్, ఎఫ్ఆర్ఓ సుభాష్ లతో మాట్లాడి ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఆదివారం పోడు భూములు పోయినవాళ్లకు మరో పక్క సర్వే చేయించి హద్దులు పెట్టి 35 ఎకరాలు ఇప్పిస్తామని మాట ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు.



రైతుల సాగునీటి సమస్యల పరిష్కారానికి

# కట్టుబడి ఉన్నాం



● ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు

కాగజ్‌నగర్ రూరల్, మే 9, ప్రభాతవార్త :

రైతుల సాగునీటి సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. రైతు వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని ఈజ్గాం విలేజ్ నంబర్4లో ఉన్న లోయర్ డ్యామ్‌ను సిర్పూర్ శాసన సభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు పరిశీలించారు. డ్యామ్ పరిస్థితిని ఇరిగేషన్ అధికారులతో కలిసి సమీక్షించి రైతులకు అవసరమైన సాగునీటి సదుపాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్యామ్‌లోని షటర్లు, సైఫాన్ మరమ్మతుల కోసం తక్షణమే రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు మిగతా 2లో..

## రైతుల సాగునీటి సమస్యల పరిష్కారానికి
# కట్టుబడి ఉన్నాం

(మొదటిపేజీ తరువాయి)

మరమ్మతు పనులను పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉండటంతో అభివృద్ధి పనులకు నిధుల మంజూరులో తీవ్ర ఆలస్యం జరుగుతోందని, ప్రతి అభివృద్ధి ఫైలు ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ వద్ద నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు. అలాగే కుమురం భీమ్ అడ ప్రాజెక్టు కాలువ భూసేకరణ కోసం ఉప ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా మాట్లాడి రూ.5 కోట్లు రైతులకు విడుదల చేయించినట్లు తెలిపారు. దీంతో కాలువ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, వచ్చే వానాకాలం నాటికి కాలువ ద్వారా కాగజ్‌నగర్ మండల రైతులకు సాగునీరు అందించేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఈఈ ప్రభాకర్, డీఈ తిరుపతి, భద్రయ్య, ఏఈలు క్రాంతి, స్వామి, నజ్రుల్ నగర్ సర్పంచ్ బికాస్ ఘరమీ, నాయకులు అమిత్ బిశ్వాస్, లోనారే రవీందర్, అభినాథ్ వైద్య, కాను కమల్ సర్కార్, జ్యోతిర్మయి మండల్, రణ్వీర్ బిశ్వాస్, నవీన్ గౌడ్ తదితరులు, రైతులు పాల్గొన్నారు.

## ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్ష పదవులకు దరఖాస్తులు స్వీకరించిన ఎస్సీ సెల్ పరిశీలకులు

**ఆసిఫాబాద్, మే 9, ప్రభాతవార్త :**



కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్ష పదవులకు దరఖాస్తులను ఉమ్మడి ఆదిలాబాద్ ఎస్సీ సెల్ పరిశీలకులు సమతా సుదర్శన్, డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క స్వీకరించారు. శనివారం కుమురంభీం జిల్లా డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఎస్సీ సెల్ పదవుల నియామకానికి సంబంధించి ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తోందని, ఎస్సీ వర్గాలకు పార్టీలో సముచిత ప్రాధాన్యత కల్పిస్తున్నదన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేసే నాయకులకు అవకాశాలు కల్పించడమే లక్ష ్యమని పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేసే వారు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, గ్రంధాలయ చైర్మన్ కామ్రే అనిల్ కుమార్, ఆసిఫాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా బాయ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పస్తం పోషం, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ కట్కూర్ భీమ్ రావ్, ప్రధాన కార్యదర్శి చిన్న మల్లేష్, దుర్గం సోమయ్య, అధికార ప్రతినిధి దుర్గం రవీందర్, కౌన్సిలర్ లు రాపర్తి కార్తీక్, నిచల్, హనుమండ్ల సాయి, రాజేందర్, కొండు సాయి, మాజీ మండల అధ్యక్షులు చరణ్, మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి, టౌన్ ప్రెసిడెంట్ రఫీక్, వార్డు మెంబెర్ జావీద్, కాంగ్రెస్ నాయకులు చునర్కర్ వసంత్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్లకు ఉచిత యోగ, ఆరోగ్య శిక్షణ తరగతులు

**- మే 11 నుంచి మందమర్రి సింగరేణి గ్రౌండ్‌లో ప్రారంభం**

**మందమర్రి, మే 9, ప్రభాతవార్త**



సీనియర్ సిటిజన్ల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా మందమర్రి సింగరేణి గ్రౌండ్‌లో ఈనెల 11వ తేదీ నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు ఉచిత యోగ, ఆరోగ్య శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగపెడి రాజలింగు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు, అలాగే సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. సీనియర్ సిటిజన్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నిత్యం యోగాభ్యాసం చేయడం ద్వారా శ్వాసకోశ సంబంధిత సమస్యలు, గుండె జబ్బులు, రక్తపోటు, షుగర్, మోకాళ్ళ నొప్పులు, పక్షవాతం వంటి అనేక ఆరోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగ ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. మందమర్రి ప్రజలందరూ ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకుని ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు కొంపెల్లి రమేష్, బర్ల సదానందం, రిటైర్డ్ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు సంపత్, గుండెబోయిన సారయ్య, యోగా హాల్ సీనియర్ సభ్యులు గంప అనిల్, శ్రీనివాస్, సూర్య నమస్కారాల్లో గిన్నిస్ రికార్డు సాధించిన మద్ది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, మే 9, ప్రభాతవార్త**



జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మంచిర్యాల నియోజకవర్గ స్థాయి సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య లతో కలిసి వ్యవసాయ శాఖ అధికారులు, తహసిల్దారులు, రైస్ మిల్లర్ల అసోసియేషన్, లారీ అసోసియేషన్ ప్రతినిధులు, ఐకెపి సభ్యులతో వరి ధాన్యం కొనుగోలు, తరలింపు, లారీలు, హమాలీ ఇతర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ స్వయం సహాయక సంఘాలకు ఇవ్వడం జరిగిందని, ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు పర్యవేక్షి ంచాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల వద్ద గల ధాన్యంను నిబంధనల ప్రకారం పరిశీలించి నాణ్యత, తేమ శాతం, రైతులకు టోకెన్ అందించాలని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించి కొనుగోలు ప్రక్రియ అనంతరం గోదాములకు, రైస్ మిల్లులకు తరలింపు ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలని, జిల్లాలో చేపట్టిన వారి ధాన్యం సాగులో దాదాపు 65 శాతం మంచిర్యాల నియోజకవర్గంలో జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 12 రైస్ మిల్లులు పని చేస్తున్నాయని, కొనుగోలు కేంద్రాల నుండి కేటాయించిన ప్రకారం వచ్చిన లారీలను రోజుకు కనీసం 10 లారీలకు తగ్గకుండా ధాన్యం దిగుమతి చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో ధాన్యం నిల్వ చేసేందుకు 6 గోదాములు అందుబాటులో ఉన్నాయని, జైపూర్ లోని సుముఖ గోదాములో 35వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేయవచ్చని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో 11 మెట్రిక్ టన్నుల నుండి 12 మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేసే అవకాశం ఉందని, ఇప్పటి వరకు 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నెల చివరి వరకు వీలైనంత ధాన్యం కొనుగోలు చేయాలని, 80 శాతం దాన్యం కొనుగోలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అకాల వర్షాల కారణంగా రైతుల వద్ద నుండి కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని తడవకుండా రైతుల సంక్షేమం లో భాగంగా గోదాములలో నిలువ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో గోదాములు పూర్తిగా నిండిన అనంతరం అవసరం మేరకు నూతన గోదాములు గుర్తించి నిల్వ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లారీలు, అందుబాటులో ఉన్న ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, గోదాముల సామర్థ్యం, హమాలీల సంఖ్యను పూర్తిగా వినియోగిస్తూ నిల్వలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో మిల్లింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, రవాణా వాహనాలను మిల్లులకు తగిన విధంగా కేటాయించి, వరి ధాన్యం రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. దండేపల్లి లో దాదాపు 40 వేల ఎకరాలు, లక్షెట్టిపేట మండలంలో దాదాపు 28 వేల ఎకరాలు, హాజీపూర్ లో 6 వేల ఎకరాలలో వరి సాగు జరుగుతుందని, ఈ ప్రకారంగా వచ్చే ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని, లారీలు, హమాలీల లభ్యత పరిశీలించుకుని అవసరం మేరకు సమకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు తమ శాఖ పూర్తి స్థాయి ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో రైస్ మిల్లులు, లారీలు, హమాలీలు, కొనుగోలు కేంద్రాలలో తలెత్తే సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ తప్పదు

**- శ్రీరాంపూర్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆకుల అశోక్**

**నస్పూర్, మే 9, ప్రభాతవార్త**



శ్రీరాంపూర్ ఏరియాలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని శ్రీరాంపూర్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆకుల అశోక్ హెచ్చరించారు. నేరాల నియంత్రణలో భాగంగా శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్ ఉన్న వ్యక్తులను పిలిపించి శనివారం వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, రాత్రి వేళల్లో గొడవలు సృష్టించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సమాజంలో మత్తు పదార్థాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో, రౌడీ షీటర్లకు యూరిన్ నార్కోటిక్ కిట్ల ద్వారా డ్రగ్స్ పరీక్షలు చేయించారు. డాక్టర్ల సమక్షంలో వారికి కౌన్సెలింగ్ ఇప్పించారు. ఈ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని, వారిని డీఅడిక్షన్ సెంటర్లకు తరలిస్తామని పోలీసులు వెల్లడించారు. నిబంధనలు అతిక్రమించే వారిని తక్షణమే రిమాండ్‌కు పంపిస్తామని తెలిపారు. శ్రీరాంపూర్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని, చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఇన్స్పెక్టర్ అశోక్ పేర్కొన్నారు. నేర చరిత్ర ఉన్న వ్యక్తులు తమ ప్రవర్తన మార్చుకుని సాధారణ జీవితం గడపాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్సై మేకల సంతోష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పెళ్లిరోజు సందర్భంగా అన్నదానం

**బెల్లంపల్లి, మే 09, ప్రభాతవార్త**



సామాజిక సేవలో ముందంజలో నిలుస్తున్న జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం 405వ సారి విజయవంతంగా నిర్వహించబడింది. బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమం సేవా భావానికి ప్రతీకగా నిలిచింది. బెల్లంపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దుర్గం జయతారచిన్నయ్య దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బిఆర్ఎస్ పార్టీ బెల్లంపల్లి పట్టణ యువజన అధ్యక్షుడు సబ్బని అరుణ్ దాతగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో యాచకులు, నిరుపేదలు, రోజువారీ కూలీలు, చిరువ్యాపారులు, బాటసారులకు సుమారు 180 మందికి స్వచ్ఛమైన, రుచికరమైన భోజనం అందించారు. ఈ సందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ జనహిత అన్నపూర్ణ కార్యక్రమం అనేది కేవలం అన్నదానం మాత్రమే కాకుండా, సమాజంలో మానవత్వాన్ని పెంపొందించే ఒక గొప్ప సేవా యజ్ఞమని అన్నారు. ఇప్పటివరకు 405 సార్లు విజయవంతంగా నిర్వహించడం సమితి సభ్యుల అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత విస్తృతంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించేందుకు దాతలు, సేవాభిలాషులు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నిరంతరం సహకారం అందిస్తున్న దాతలు, సేవా కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం ప్రశాంతంగా, సక్రమంగా సాగేందుకు సమితి సభ్యులు శ్రద్ధగా ఏర్పాట్లు చేశారు. భోజనం పంపిణీ సమయంలో లబ్దిదారులు సంతృప్తిని వ్యక్తం చేస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాత సబ్బని అరుణ్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూనెటి సత్యనారాయణ, సీనియర్ నాయకులు ఎరుకల సుందర్ రావు, కౌన్సిలర్లు ఆసాది మధు, తిరుమలవాసు, నాయకులు ఖలీం, ఖలీల్, చాంద్ పాషా, ఆకుల సాయి, బత్తుల కృష్ణవెల్, కుడికాళ్ల రవితేజ, అరవింద్, బెద్దల మహేందర్, గోమాస వినోద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జనహిత సేవా సమితి కోశాధికారి కొడిపెల్లి గిరిప్రసాద్, కార్యవర్గ సభ్యులు నిచ్చకోల గురుస్వామి, చిలుముల సాయి కృష్ణ, బోనాల సతీష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



అంబలి పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

## వేసవి నేపథ్యంలో అంబలి పంపిణీ

**ఆసిఫాబాద్, మే 9, ప్రభాతవార్త :**

యువత సమాజ సేవలో నిరంతరం ముందుండాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టియుడబ్ల్యూజే) కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని వారసంత సందర్భంగా యుబీవై ఫౌండేషన్ అధ్యక్షులు ఉబెద్ బీన్ యాహియా (తారిఖ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలకు అంబలిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా సామాన్య ప్రజల దాహార్తిని తీర్చడానికి యుబీవై ఆధ్వర్యంలో గత కొన్ని ఏళ్లుగా అంబలి పంపిణీ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. తోటి వారికి సహాయం చేయడంలోనే నిజమైన తృప్తి ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమ వంతుగా సామాజిక బాధ్యతను చాటుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ యాదవ్, ఫౌండేషన్ సభ్యులు మెహరాజ్ హుస్సేన్, తహేర్, అబ్దుల్ అచబ్, ఉమర్ ఆఫ్హారి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సర్పంచ్ బల్గురి అజయ్

## ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

**సారంగాపూర్, మే 09, ప్రభాతవార్త**

మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు ఎండ నుండి ఉపశమనం కల్పించేందుకు సర్పంచ్ బల్గురి అజయ్ మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా కూలీలు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

### నీటి ఎద్దడి లేకుండా

## బోర్ల మరమ్మతులు

**సారంగాపూర్, మే 09, ప్రభాతవార్త**

మండలంలోని ధని గ్రామంలో వేసవికాలంలో ప్రజలకు నీటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు సర్పంచ్ బడి పోతన్న శనివారం గ్రామంలోని అన్ని బోర్లను మరమ్మత్తులు చేయించారు. చెడిపోయిన బోర్ల స్థానంలో నూతన మోటార్లను బిగించి ప్రజలకు నీటి సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మల్టీపర్పస్ వర్కర్లు పాల్గొన్నారు.



బోర్ల మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ బడి పోతన్న

### ఇంట్లో పనిచేసే వ్యక్తుల వివరాలు

# స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేయాలి

**ఆసిఫాబాద్, మే 9, ప్రభాతవార్త :**



కుమురం భీం జిల్లా వ్యాప్తంగా ఇంట్లో పనిచేసే వ్యక్తుల వివరాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ శనివారం సూచించారు. ఇంటి యజమానులు తమ ఇళ్లలో పనిచేసే వంట మనుషులు, సెక్యూరిటీ గార్డులు, డ్రైవర్లు, సహాయకుల వివరాలను తప్పనిసరిగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయాలన్నారు. అనుమానాస్పద ఘటనలు, భద్రతా సమస్యలు తలెత్తకుండా ముందస్తు సమాచారమని వెల్లడించారు. అదేవిధంగా తమ ఇళ్లలో, భవనాలలో అద్దెకు గదులు ఇచ్చే యజమానులు కూడా అద్దెదారుల పూర్తి వివరాలను ముందస్తుగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు తెలియజేసి, పోలీసుల ద్వారా వెరిఫికేషన్ చేయించుకోవాలని ఎస్పీ సూచించారు. పని కోసం నియమించుకున్న వ్యక్తుల ఆధార్ కార్డు, ప్రస్తుత నివాస చిరునామా, ఫోటో, మొబైల్ నంబర్ మరియు ఇతర వ్యక్తిగత వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయడం ద్వారా యజమానులు భద్రతాపరమైన సమస్యల నుండి రక్షణ పొందవచ్చని తెలిపారు. ముఖ్యంగా నేపాల్‌కు చెందిన వ్యక్తులను ఉద్యోగాల్లో నియమించుకునే సందర్భాల్లో పూర్తి ధృవీకరణ అనంతరమే పనిలోకి తీసుకోవాలని, వారి వివరాలను తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయించాలని సూచించారు. జిల్లా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# చిన్న వర్షానికే చిత్తడవుతున్న రోడ్లు

- ఖైర్‌గాం గ్రామంలో చెరువులను తలపిస్తున్న వీధులు
- డ్రైనేజీలు నిర్మించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తుల విజ్ఞప్తి

**రెబ్బెన, మే 9,ప్రభాతవార్త:**



మండలంలోని పలు గ్రామాల్లో చిన్నపాటి వర్షాలకే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. వర్షపు నీరు రోడ్లపైనే నిలిచిపోవడంతో కొన్ని కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపై నిలిచిన నీటిని దాటి వెళ్లేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లక రోడ్లపైనే పేరుకుపోతోంది. దీంతో బురదమయంగా మారి దోమలు విపరీతంగా పెరిగి దుర్వాసన వ్యాపిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఖైర్‌గాం గ్రామంలో రెండు రోజుల క్రితం కురిసిన స్వల్ప వర్షానికే ప్రధాన రహదారి చెరువును తలపించేలా మారిందని గ్రామస్తులు తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు రోడ్డుపై నడవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. డ్రైనేజీలు లేని ప్రాంతాల్లో వెంటనే కాలువలు నిర్మించి, రోడ్డుపై మొరం పోసి వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# దళిత మహిళపై అసభ్యకర పాట

- దోషులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి - దళిత సంఘాల ఐక్య వేదిక డిమాండ్

**బెల్లంపల్లి, మే 09, ప్రభాతవార్త**

దళిత మహిళపై అసభ్యకరంగా పాట రాసి పాడిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని దళిత సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు ఈరోజు బెల్లంపల్లి పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం దళిత సంఘాల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి గోమాస రాజం ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా వేదిక అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిలుక రాజనర్సు హాజరై మాట్లాడారు. పెద్దపల్లి జిల్లా రామగుండం (గోదావరిఖని) ప్రాంతంలో ఒక దళిత మహిళపై అసభ్యకరంగా పాట రచించి పాడడం అత్యంత దుర్మార్గమని పేర్కొన్నారు. ఆ మహిళ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా, ఆమె ఆత్మగౌరవాన్ని హననం చేసేలా చేసిన ఈ చర్య సమాజాన్ని తలదించుకునేలా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన ద్వారా మహిళలందరినీ అవమానించే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ దుర్ఘటనలో నేరుగా పాల్గొన్న వారితో పాటు, వారి వెనుక ఉండి ప్రేరేపించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరారు. ఇక సింగరేణిలో కార్మికుల హక్కుల కోసం పోరాడే సంస్థగా పేరుగాంచిన ఏఐటియుసి యూనియన్‌లో ఇటువంటి ఘటనలు చోటు చేసుకోవడం విచారకరమని అన్నారు. కార్మికుల హక్కులు, మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన యూనియన్‌లోనే మహిళలపై అవమానకర చర్యలు జరగడం తీవ్రంగా ఖండనీయమని పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వ్యక్తులను ఏఐటీయూసీ యూనియన్ తక్షణమే బహిష్కరించాలని, లేకపోతే యూనియన్ వారిని సమర్థిస్తున్నట్టే భావించాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే సింగరేణి యాజమాన్యం కూడా ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని సంబంధిత వ్యక్తులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో ఈ పాట వైరల్ అయిన నేపథ్యంలో, పోలీస్ అధికారులు స్వయంగా కేసు నమోదు చేసి దోషులను అరెస్ట్ చేయాలని, మహిళ గౌరవాన్ని కాపాడే దిశగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గోమాస రాజం ప్రధాన కార్యదర్శి, కాలాలి నర్సయ్య గౌరవ సలహాదారు, మాసం మురళి ముఖ్య సలహాదారు, కారెంగుల మల్లేష్ కార్యదర్శి, గోగర్ల శేఖర్, గద్దల కుమార్, నాతరి భీమయ్య, చిలుక పోషం తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ క్యాస్ట్రో కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి 18వ వర్ధంతి

**బెల్లంపల్లి, మే 09, ప్రభాతవార్త**

తెలంగాణ క్యాస్ట్రోగా పేరుగాంచిన, వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అగ్రగణ్య నాయకులలో ఒకరైన కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి 18వ వర్ధంతి సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం ఎమ్సిపిఐ యు పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి జీవిత విశేషాలను వివరించారు. ఆయన 1922 మార్చి 15న నేటి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెం గ్రామంలో భీమిరెడ్డి రాంరెడ్డి, చొక్కమ్మ దంపతులకు జన్మించినట్లు తెలిపారు. విద్యార్థి దశలోనే గ్రామీణ ప్రాంతాల్లో దొరల ఆగడాలు, నైజాం రజాకార్ల దౌర్జన్యాలను చూసి చలించిపోయిన ఆయన, ఆంధ్రమహాసభ కార్యక్రమాల ద్వారా ఉద్యమాలలోకి అడుగుపెట్టి, క్రమంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక నాయకుడిగా ఎదిగారని చెప్పారు. ప్రజలను చైతన్యపరచి, వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా సాయుధ పోరాటానికి నడిపించిన మహానేతగా ఆయన నిలిచారని కొనియాడారు. కామ్రేడ్ బి.ఎన్. దొరల అణచివేతకు ఎదురు నిలిచి, వెట్టి మనుషులను పోరాట యోధులుగా తీర్చిదిద్దడంలో, భూస్వామ్య వ్యవస్థను కుదేలు చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారని పేర్కొన్నారు. సుమారు పది లక్షల ఎకరాల భూ పంపిణీ, మూడు వేల గ్రామ రాజ్యాల నిర్మాణంలో ఆయన పాత్ర విశేషమని గుర్తు చేశారు. సాయుధ పోరాట కాలంలో మొదట ఆయుధం చేపట్టి, చివరివరకు పోరాటాన్ని కొనసాగించిన నేతగా ఆయన చరిత్రలో నిలిచారని తెలిపారు. ప్రపంచ విప్లవోద్యమంలో చె గువేరా మాదిరిగా తెలంగాణ పోరాటంలో చెరగని ముద్ర వేసిన నాయకుడని, ప్రముఖ విద్యావేత్త చుక్క రామయ్య ఆయనను తెలంగాణ క్యాస్ట్రో గా అభివర్ణించడం ఆయన గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. తదుపరి కాలంలో కమ్యూనిస్టు ఉద్యమంలో చురుకుగా పాల్గొంటూ, సిపిఎం పార్టీ ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా, మూడు సార్లు ఎంపీగా ఎన్నికై, చట్టసభల్లో పీడిత ప్రజల పక్షాన గళమెత్తారని పేర్కొన్నారు. పార్లమెంటు వెలుపల కూడా అనేక ప్రజా ఉద్యమాలకు నేతృత్వం వహించి ప్రజా హక్కుల సాధనలో ముందుండారని వివరించారు. అలాగే అచల భారత రైతు నాయకుడిగా గోదావరి జలాలను సూర్యాపేట ప్రాంతానికి అందించేందుకు పోరాడి, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ రెండో దశకు




శంకుస్థాపన జరగడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. నల్గొండలో యూనివర్సిటీ స్థాపన, బీబీనగర్–నడికుడ రైల్వే లైన్ సాధనలో కూడా ఆయన పాత్ర విశేషమని పేర్కొన్నారు. ఇలాంటి త్యాగధనుల చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, నల్గొండ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టాలని, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ రెండో దశకు ఆయన పేరు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్సిపిఐయు పార్టీ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, మండల కార్యదర్శి ఆరేపల్లి సతీష్, అచల భారత మహిళా సమాఖ్య నాయకురాలు కాంపల్లి రాధా తదితరులు పాల్గొన్నారు.



## ఫాస్ట్‌ట్రాక్ చెక్ పోస్టులను ఎత్తివేయాలని బిజెపి ఆధ్వర్యంలో రాస్తారోకో

**జన్నారం, మే 9, ప్రభాతవార్త**

అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ట్రాక్ చెక్ పోస్ట్‌లను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో తపాలాపూర్ చెక్ పోస్ట్ వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి మండల అధ్యక్షులు జీ.మధుసూదన్ రావు మాట్లాడుతూ ఫాస్ట్ ట్రాక్ పేరుతో అటవీశాఖ అధికారులు వాహనదారుల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. జన్నారం మండలంలోని ఇంధనపెల్లి, తపాలపూర్ వద్ద ఏర్పాటుచేసిన ఫాస్ట్ ట్రాక్ చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేయాలని లేని యెడల ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి ఎరుకల రమేష్ గౌడ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అజ్మీరా బద్రి నాయక్, పోనకల్ ఉపసర్పంచ్ అప్పల జలపతి, పార్టీ సీనియర్ నాయకులు కొంత శంకరయ్య, సామల లక్ష్మీరాజం, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## మత్స్యకార సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక

**జన్నారం, మే 9, ప్రభాతవార్త**

మండలంలోని చింతలపల్లి, బాదాంపల్లి ఫిషర్‌మెన్ కోఆప్ సొసైటీ లిమిటెడ్ నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. ఈ ఎన్నికలకు సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎం.తిరుపతి రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షులుగా జింక లక్ష్మీరాజం, ఉపాధ్యక్షుడుగా నర్సయ్య, కార్యదర్శిగా ఎర్ర రాజన్న, సభ్యులుగా జినుక నరేష్, జినుక వెంకటేష్, జింక గంగయ్య, బొరే రాజయ్య, కల్లెడ అచ్చయ్య, జింక రాకేష్, దుబ్బయ్య, రామయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు ఎన్నికల అధికారి ఎం.తిరుపతి రెడ్డి అభినందనలు తెలిపారు. సొసైటీ అభివృద్ధికి, మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చింతలపల్లి సర్పంచ్ పంజలా సురేష్, పంచాయతీ కార్యదర్శి రాము, పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

### ఏఐ అనుసంధానంతో

## వాట్సాప్ చాట్‌బాట్ సేవలు ప్రారంభం

**ఆసిఫాబాద్ టౌన్, మే 9, ప్రభాతవార్త :**



కృత్రిమ మేధ ఆధారిత వాట్సాప్ చాట్‌బాట్ సేవలను ప్రారంభించినట్లు కుమురంభీమ్ ఆసిఫాబాద్ సర్కిల్ విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 నుంచి తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ 18 జిల్లాల్లో రూ. 70.39 లక్షల వినియోగదారులకు వేగవంతమైన పారదర్శకమైన సేవలను అందిస్తున్నామన్నారు. వినియోగదారులు తెలుగు, ఇంగ్లీష్ రెండు భాషలలోనూ మెసేజ్ చేసిన ఏఐ ఉపయోగించి ఆ ప్రశ్నను అర్థం చేసుకొని అందుకు తగ్గట్టుగా విశ్లేషించుకుని సమాచారాన్ని అందిస్తుందని, తమ స్వంత మాటల్లో వినియోగదారులు తెలుగులో, ఇంగ్లీష్ లో టైప్ చేయవచ్చని తెలిపారు. ప్రస్తుత బిల్లు మొత్తం, చెల్లింపు తేదీ, వినియోగదారులు చెల్లించిన రికార్డు, వినియోగదారు సేవా ప్రాంతంలో ప్రస్తుత అంతరాయ స్థితిగతులను తెలుసుకోవచ్చన్నారు. చాట్‌బాట్‌కు సమాధానం చెప్పలేని పరిష్కరించలేని సమస్య వచ్చినప్పుడు వినియోగదారుని ఏజెంట్‌కు తరలించి పరిష్కరించబడతాయన్నారు. ఈ వాట్సాప్ చాట్‌బాట్ సేవలు వినియోగదారులకు 24 7 అందుబాటులో సేవలు కొనసాగుతాయని, రైతులకు అర్థమయ్యే విధంగా తెలుగు భాషలో అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. విద్యుత్ బిల్లుల పూర్తి సమాచారం, బిల్లుల విచారణలు, చెల్లింపుల స్థితి సెకన్లలో పరిష్కరించబడతాయన్నారు. వినియోగదారులు తమ మొబైల్‌లో 8712481489 ద్వారా వాట్సాప్‌లోకి వెళ్లి కావలసిన సేవలను సులభంగా పొందవచ్చన్నారు.

## పేదల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ
- హర్షిత్ ప్రిన్స్ కుటుంబానికి 7 లక్షల రూపాయల ఎల్‌ఓసీ చెక్కు అందజేత

**నస్పూర్, మే 9, ప్రభాతవార్త**



హర్షిత్ ప్రిన్స్ కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ చెక్కును అందజేస్తున్న దృశ్యం

ఆపదలో ఉన్న పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పేర్కొన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32వ డివిజన్‌కు చెందిన హర్షిత్ ప్రిన్స్‌కు ఆరోగ్య ఖర్చుల నిమిత్తం మంజూరైన 7 లక్షల రూపాయల ఎల్‌ఓసీ చెక్కును శనివారం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మధుకర్, టీపీసీసీ సభ్యులు నూకల రమేష్‌తో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు ఆమె అందజేశారు. వైద్య ఖర్చుల భారం భరించలేని స్థితిలో ఉన్న తమకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు చొరవతో ఇంత పెద్ద మొత్తంలో సాయం అందడం పట్ల హర్షిత్ ప్రిన్స్ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కష్టకాలంలో తమను ఆదుకున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు, సురేఖకు వారు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో వైద్య సాయం అందేలా కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.